క్లుప్తంగా

సైబర్ క్రైమ్, నూతన చట్టాలపై అవగాహన


ముంజేరులో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రవికుమార్

భోగాపురం: మండల కేంద్రంలోని కొమ్మూరు అప్పడుదొర మెమోరియల్ జూనియర్ కళాశాలతో పాటు ముంజేరు గ్రామంలో ఎస్సై కె. రవికుమార్ ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే బ్యాంక్ ఖాతా, ఏటీఎం వివరాలు తెలియజేయకూడదన్నారు. అలాగే డ్రగ్స్ సరఫరా, వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ


స్కాలర్‌షిప్పులు అందుకున్న విద్యార్థులతో బయోస్టాట్ కంపెనీ సిబ్బంది

భోగాపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఏడుగురు విద్యార్థులకు బయోస్టాట్ కంపెనీ సిబ్బంది శనివారం ప్రగతి స్కాలర్‌షిప్పులు అందజేశారు. విద్యార్థులకు రూ. 17,500 అందజేసినట్లు కంపెనీ జనరల్ మేనేజర్ నవీన్, రీజనల్ మేనేజర్ నాగభూషణ్ తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు రాంబాబు, లక్ష్మీనారాయణ, కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు కిశోర్, కిరణ్, హెచ్‌ఎం శ్రీనివాసరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఈ - పంట' నమోదుపై అవగాహన


ఈ - పంట నమోదుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నెల్లిమర్ల: ఈ పంట నమోదుపై రైతులకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ పి. సుదర్శనరావు, వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎస్. కోటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి ఎం. పూర్ణిమ ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ అధికారులు, రైతుసేవా కేంద్రం సిబ్బందికి ఈ - పంట నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ - పంటలో వివరాలు నమోదు చేయడం వల్ల పంటల బీమా, సున్నావడ్డీ రుణాలు, విత్తనాలు, ఎరువులు, సబ్సిడీ పథకాలు వర్తిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు, వీఆర్‌ఓ, ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

ఇంటింటి కుళాయి కనెక్షన్‌కు సర్వే


మాట్లాడుతున్న కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు

విజయనగరం: ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్లు అందివ్వాలనే ఉద్దేశంతో ఇంటింటి సర్వే చేపడతామని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, సర్వే కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించామన్నారు. వారంతా నగరంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఏ ఇంటికి కుళాయి ఉందో, లేదోనన్న వివరాలు నమోదు చేసుకుని నివేదికలు రూపొందిస్తారని చెప్పారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. సొంత ఇంటి వారే కాకుండా.. అద్దె ఇంట్లో ఉన్న వారు కూడా ఇంటి యజమానికి విషయాన్ని తెలియపరిచి ఇంటి పన్ను రశీదును తమ సిబ్బందికి చూపించాలని తెలిపారు. దీనివల్ల కుళాయి కనెక్షన్లు అందించే ఏర్పాట్లు చేస్తామన్నారు.

ఆదినారాయణ స్మారక కళాపీఠం ప్రారంభం నేడు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గంటా లక్ష్మి, తదితరులు

విజయనగరం టౌన్: ఆదినారాయణ స్మారక కళాపీఠాన్ని ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు కళాపీఠం వ్యవస్థాపకురాలు గంటా లక్ష్మి ఉత్సవానికి సంబంధించిన కరపత్రాలను కళాపీఠం ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకులు ఎమ్.భీష్మారావు దంపతులు, మహారాజా సంగీత, నృత్యకళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ బురిడి అనురాధా పరశురామ్ దంపతులు, ఆది గురువు కంది పాపాయ్యమ్మలను సత్కరించనున్నట్లు చెప్పారు. సంగీతాభిమానులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కుసుమంచి మహేష్, తిరుపతిరావు, రామకృష్ణ, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.


పూసపాటిరేగ: కోల్‌కతాలో వైద్యురాలి హత్యకు నిరసనగా ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

నిందితులను కఠినంగా శిక్షించాలి

కోల్‌కతాలో మెడికల్ విద్యార్థిని మౌమితపై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని వైద్యులు, వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు సంఘటనను ఖండిస్తూ విజయనగరం, నెల్లిమర్లలో శనివారం నిరసన ర్యాలీలు చేపట్టారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముర్రు జయచంద్రనాయుడు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ పీఏ రమణి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది విజయనగరం సర్వజన ఆస్పత్రి వద్ద మానవహారంగా ఏర్పడి నిందితులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్


భోగాపురం: వైద్య విద్యార్థి మౌమిత హత్యకు నిరసనగా ర్యాలీ నిర్వహిస్తున్న సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది



విజయనగరం ఫోర్ట్: ర్యాలీ చేస్తున్న వైద్యులు, వైద్య విద్యార్థులు


నెల్లిమర్ల: నిరసన తెలియజేస్తున్న వైద్యులు, సిబ్బంది


విజయనగరం ఫోర్ట్: డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూర్యనారాయణ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ


విజయనగరం పూల్‌బాగ్: విజయనగరం ముచ్చెరువు గట్టుపై కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న మహిళలు, యువకులు


విజయనగరం ఫొటోగ్రాఫర్: కలెక్టరేట్ వద్ద వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్లు, విద్యార్థులు


విజయనగరం ఫొటోగ్రాఫర్: నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య విద్యార్థులు

మాజీ మంత్రి పెనుమత్సకు నివాళులు


సాంబశివరాజు స్మృతివనం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద గ్రామంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి దివంగత పెనుమత్స సాంబశివరాజు 91వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు.

ఆయన స్మృతివనంలోని సమాధి వద్ద ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నెల్లిమర్ల పట్టణంలోని కన్యాకాపరమేశ్వరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు అంబళ్ల శ్రీరాములనాయుడు, కేవీ సూర్యనారాయణరాజు, మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్‌బాబు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, నాయకులు సముద్రపు రామారావు, రేగాన శ్రీను, పతివాడ అప్పారావు, కనకారావు, లక్ష్మణరావు, పంచాది శ్రీరాములనాయుడు, నల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌ఎంసీ ఎన్నిక

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గుషిణి ప్రాథమిక పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక శనివారం ప్రశాంతంగా ముగిసింది. చైర్‌పర్సన్‌గా బంకపల్లి ఝాన్సీ, వైస్ చైర్‌పర్సన్‌గా రెల్లివలస సత్యవతి ఎన్నికైనట్లు ఎంఈఓ ఈపు విజయ్‌కుమార్ తెలిపారు. ఎన్నికైన కమిటీ సభ్యులను గ్రామపెద్దలు అభినందించారు.

సెంచూరియన్ విద్యార్థికి అభినందన


విద్యార్థి నిహాంత్‌ను అభినందిస్తున్న వీసీ పీకే మహంతి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేసిన కలిశెట్టి నిహాంత్ నాయుడు అమెరికాకు చెందిన యూనిటీ గ్రిడ్ సంస్థలో రూ.35 లక్షల ప్యాకేజీతో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ మేరకు విద్యార్థిని వీసీ పీకే మహంతి, తదితరులు శనివారం అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకలతో ఇక్కట్లు



తెర్లాం: రాజాం–రామభద్రపురం ఆర్‌అండ్‌బీ రోడ్డులో గతకొన్ని రోజులుగా భారీ వాహనాల రాకపోకలు జరుగుతుండడంతో వాహన చోదకులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే రోడ్డులో తెర్లాం జంక్షన్ మీదుగా రామభద్రపురం వైపు, రామభద్రపురం నుంచి రాజాం వైపు భారీ వాహనాలు, ట్యాంకర్లు వస్తున్నాయి. ఈ వాహనాల రాకపోకలతో బస్సులు, కార్లు, ఆటోలు నడిపే వారంతా ఇక్కట్లు పడుతున్నారు. ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోతోందని, అలాగే ఎప్పుడు ఏ క్షణాన ఏం ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉందంటున్నారు. రాత్రి వేళల్లో భారీ వాహనాలు తెర్లాం మీదుగా బొబ్బిలి వైపు ఎక్కువగా వెళ్తుండడంతో రోడ్లు మరమ్మతులకు గురవుతున్నాయంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, భారీ వాహనాల రాకపోకలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై ఫిర్యాదు


పీడీకి ఫిర్యాదు చేస్తున్న వల్లూరు గ్రామస్తులు

- వాడీవేడిగా ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

నెల్లిమర్ల: మండలంలోని వల్లూరు, పారసాం గ్రామాలకు చెందిన ఉపాధి హామీ క్షేత్ర సహాయకులను తొలగించాలని ఆయా గ్రామాలకు చెందిన వేతనదారులు కోరారు. ఈ మేరకు పీడీ ఉమాపరమేశ్వరికి ఫిర్యాదు చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా వివిధ గ్రామాల్లో బయటపడిన విషయాలను రిసోర్స్‌పర్సన్లు వెల్లడించారు. ఏ గ్రామంలోనూ దరఖాస్తు చేసుకున్న వెంటనే జాబ్‌కార్డులు మంజూరు చేయడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. వల్లూరు గ్రామానికి సంబంధించి ఆరు నెలల కిందట అడిగిన వారికి కూడా జాబ్‌కార్డులు అందజేయలేదన్న ఫిర్యాదులు వచ్చినట్లు వెల్లడించారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్‌కు బదులు ఆమె భర్త పనులు చేయిస్తున్నారని తెలిపారు. పారసాం ఫీల్డ్ అసిస్టెంట్‌పై కూడా గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు రిసోర్స్‌పర్సన్లు చెప్పారు. అదే సమయంలో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కూడా నేరుగా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, ఈఓపీఆర్‌డీ సింహాద్రి, ఏపీఓ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


హాజరైన జిల్లా అధికారులు

విజయనగరం అర్బన్: జిల్లాలో ఉపాధి అవకాశాలు, ఆదాయ ఉన్నతి, ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా శాఖల వారీగా ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. లక్ష్యాలు, సామాజిక, ఆర్థిక సూచీలను అంచనా వేసి ప్రణాళికలు సమర్పించాలన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం జరిగిన వికసిత్ ఆంధ్ర-2047లో భాగంగా వచ్చే ఐదేళ్ల వరకు కార్యాచరణ ప్రణాళికపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక, ఆర్థికేతర అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలు రూపొందించాలన్నారు. జేసీ సేతు మాధవన్ మాట్లాడుతూ వాస్తవంగా చేయకలిగే పనులను మాత్రమే లక్ష్యాల్లో చేర్చాలని, గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు చేపట్టే పనులు ప్రణాళికలో ఉండాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ బాలాజీ మాట్లాడుతూ లక్ష్యాలు, కార్యక్రమాల వారీగా ప్రణాళికలు తయారు చేసి సెప్టెంబర్ 1లోగా పంపాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి, ఉద్యానశాఖ డీడీ జమదగ్ని, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట

రేగిడి: మండలంలోని సంకిలి నాగావళి నదీ పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాకు పోలీసులు శనివారం అడ్డుకట్ట వేశారు. కొంతమంది యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి, ఇసుక రవాణా జరగకుండా ట్రెంచ్‌లు ఏర్పాటు చేశారు. అక్రమార్కుల ఆగడాలను అడ్డుకుంటున్నామని ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు తెలిపారు.

బుచ్చి అప్పారావు పేరు తొలగించడం అవమానకరం..


మాట్లాడుతున్న కొప్పల వెలమ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పరదేశినాయుడు, జిల్లా అధ్యక్షుడు వరప్రసాద్, తదితరులు

- కొప్పల వెలమ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పరదేశినాయుడు

విజయనగరం ఫోర్ట్: తాటిపూడి జలాశయానికి స్వాతంత్ర్య సమరయోధుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును తొలిగించడం అతన్ని అవమానించడమేనని కొప్పల వెలమ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కిలపర్తి పరదేశినాయుడు అన్నారు. కామాక్షీనగర్‌లోని కొప్పల వెలమ సంక్షేమ సంఘ కార్యాలయంలో విజయనగరం కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ శెట్టి వీర వెంకటరాజేశ్వరావు (రాజేష్) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బుచ్చి అప్పారావు ఉత్తరాంధ్ర శ్రేయోభిలాషి అని కొనియాడారు. తాటిపూడి రిజర్వాయర్ కోసం బుచ్చి అప్పారావు ఎంతో కృషి చేశారన్నారు. అటువంటి మహానీయుడి కృషిని గుర్తించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తాటిపూడి జలాశయానికి గొర్రి పాటి బుచ్చి అప్పారావు పేరు పెడుతూ జీఓను జారీ చేసిందన్నారు. కొద్ది రోజుల కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అప్పారావు పేరును తొలగిస్తూ జీఓ జారీ చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి అప్పారావు పేరును కొనసాగించేలా జీఓ జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో కొప్పలవెలమ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు బొత్స వరప్రసాద్, సంఘ నాయకులు దొగ్గ దేముడు, చలుమూరి వెంకటరావు, కరక గోపాలరావు, యాండ్రాపు తాతబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్వారీ పనులు నిలిపివేయాలి


రామచంద్రపేటలో కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

భోగాపురం: మండలంలోని రామచంద్రపేట క్వారీ పనులనె వెంటనే నిలుపుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో శనివారం కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజల అనుమతి లేకుండా క్వారీ పనులు చేపట్టడం వల్ల బాంబు పేలుళ్ల శబ్దానికి ఇళ్ల పెచ్చులూడుతున్నాయని, తాగునీరు కలుషితమై ప్రజలు వివిధ రకాల రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పనులు నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి. శ్రీనివాసరావు, బి. సూర్యనారాయణ, గ్రామపెద్దలు దుక్క అప్పన్న, రమణ, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


జీవామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బొబ్బిలి రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై శనివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ నిపుణులు యు.శంకరరావు మాట్లాడుతూ ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలు అనుసరిస్తూ వ్యవసాయం చేయాలని, తద్వారా తక్కువ పెట్టుబడి ఖర్చుతో అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రకృతి సేద్యంలో భాగంగా తయారుచేసుకునే నీమాస్త్రం, వేప కషాయం వంటి సేంద్రియ ఎరువులను పంటకు వినియోగిస్తే చీడపీడలు, తెగుళ్లు పంటకు సోకవన్నారు.

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో జీవామృతం తయారీపై ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు అవగాహన కల్పించారు. కిలో బెల్లం, కిలో శనగపిండి, పది లీటర్ల ఆవుమూత్రం తదితర వాటిని ఓ టబ్బులో వేసుకుని మూడు రోజుల పాటు మురగబెడితే జీవామృతం తయారవుతుందన్నారు. ఇలా తయారైన జీవామృతాన్ని వరి పంటపై పిచికారీ చేస్తే ఆ పంటకు సోకే తెగుళ్లను నివారించవచ్చన్నారు.